# కలవరింతల బతుకు

"ఏం నాన్నా! పట్నం వెళ్లొస్తానన్నావుగదూ? ముంతిదిగో దారిలో కాస్త గంజి నీళ్ళు తాగుదుగాని".

సీతి అందిచ్చింది. కిష్టయ్య అరుగుమీదకూచుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. నేలమీదికి ఒరిగివున్న ఇంటికప్పు వీళ్ళ మొహాలు దారినపోయేవాళ్ళకి కన్పించకుండా చేస్తోంది. కిష్టయ్య తలపాగా చుట్టుకు నున్నాడు. భుజంమీద ఓ తువ్వాలుంది. పక్కని కఱ్ఱ. తీనిమీద నిరీక్షిస్తున్న కిఱ్ఱుజోడు దారి సరిచూస్తోంది. ప్రమాణానికి సిద్ధమయ్యేవున్నాడు.

"లే నాన్నా! పొద్దెక్కుతే మళ్లి ప్రయాణం కష్టం కూడాను చాలాదూరం వెళ్ళాలి" గుమ్మందగ్గిర్నించి కదిలి సీతి అతని భుజంమీద చెయ్యివేసింది.

కిష్టి నేలమీంచి దృష్టిమరల్చి, సీతి మొహంలోకి ఓ నిముషంచూసి అంటున్నాడు.

"ఏమిటి మనకీ బతుకు".

సీతి కేమీ బోధపడలేదు కాని, పెద్ద వేదాంతం వినిపించిందా మాటల్లో.

పక్కనకట్టిన ఎద్లు. ఒకటి నేలమీద పడుకుని గడ్డినేమరేస్తోంది. రెండోది రాటతో తల గోక్కుంటోంది.

కిష్టి మళ్ళి అందుకున్నాడు.

"సంవత్సరం పొడుగునా కష్టపడుతాం పన్నులు కూడా మనమే కట్టుకోవాలి. ఏమిటీ చాకిరి? మనకి తిండి కన్నా మిగలదు. వాళ్లేమో కార్లల్లో తిరుగుతూ, కాళ్ళ మీద కాళ్లేసుకుని, వెచ్చని మేడల్లో తిని కూర్చుంటారు".

ఆగాడు సీతికూడా తనకున్న జ్ఞానమంతటితోనూ ఆలోచించింది. కాని దరి కనిపించలేదు. చివరికి "కర్మ" అంది.

"కర్మేమిటి? ఏ కన్నో, కాలో లోటవుతేను. స్వయంగా దోచుకోబడ్డంచూస్తూ అట్లా ఎలా అనుకోగలం? ఇదేదో మనలోనే వుంది ఈ లోపం! వాళ్ళ హృదయాలే కరిగి మనకి సరియైన ప్రతిఫలమిస్తే ఈ 'కర్మ' ఏమవుతుంది?"

పెట్టుబడిదారీ సంఘనియమాలు, దాని పరిణామాలు తెలీక, హృదయాలు మారాలి అనుకుంటున్నాడు.

"సరే. వెళ్ళిరా ముందు, పొద్దెక్కుతోంది".

సీతి మళ్ళీ ప్రమాణంసంగతి జ్ఞాపకం చేసింది. కిష్టితొరగాలేచి, కర్రా ముంతా తీసుకుని, ఎడ్ల నోసారి తట్టి, బయలుదేరాడు.

సీతి కనుచూపువరకు సాగనంపి తనపనిలో మునిగి పోయింది.

పొలాలగట్లనుంచి వెడుతుంటే, కూలి వాళ్ళందరూ తమ పనులకి వెడుతున్నారు. కిష్టి ఎవరితోనో అంటున్నాడు.

"మొన్న వర్షాలొచ్చాయికదా? ఎట్లావుంది మీ జీవితం!"

"మాకేం నష్టం కలుగలేదు. పాకలు మాత్రం మళ్ళీ వేసుకున్నా మంతే" ఎవరో సమాధానం చెబుతారు.

"అవును. ఈ కూలివాళ్ళ బతుకేనయం. ఏరోజుకూలి ఆరోజు తెచ్చుకుని శుభ్రంగా బతుకుతారు. ఓ పంట పాడైందనిగాని, మగతా ఎట్లా చెల్లించాలనిగాని, కరణాల బాధ ఎట్లా నివారించుకోవాలనిగాని ఏమీ బెడదవుండదు. అదే నయం" అనుకున్నాడు కిష్టి.

యజమానిని ఈ సంవత్సరానికి మగతా తగ్గించమని పరిపరివిధాల ఆటగడం, ఆయన నిర్దాక్షిణ్యంగా "వీల్లేదు, పొమ్మనడం" అన్నా వరసగా జరిగిపోయాయి.

ఇంకేమార్గం తోచడంలేదు. ఈవ్యవసాయంమానడం తప్ప. గంజికూడా తాగబుద్ధి కలగడంలేదు.

"పోనీ, అప్పుచేస్తేనో..." సీతి సలహాచెప్పింది.

"చట్... ఇంతవరకూ జన్మలో చెయ్యలేదు. నర్సిగాడి పనేమైంది. ఆకష్టం గట్టెక్కగనే, మార్వాడీ తగుల్కుని, ఇల్లూగోడూ అమ్మించాడు. దేశదిమ్మరైపోయాడు పాపం!"

"అయితే ఏంచేద్దాం" సీతి అడిగింది.

"వ్యవసాయం వొదిలేస్తాను. కూలిపని చేసుకుని హాయిగా బతకొచ్చు." పొలాలగట్టున కల్సిన కూలీల్ని తల్చుకుంటున్నాడు.

"మానేస్తామా! మరి మగతా...!" ఆశ్చర్యంతో పెద్దకళ్ళను మిటకరిస్తోంది.

కొంచెం సేపుండి అన్నాడు.

"అదే ఆలోచిస్తున్నాను".

పక్కని ఎడ్లు మెడల్ని నాక్కుంటున్నాయి.

అట్లానే ఇద్దరూ ఆలోచించారు. ఒకరోజు, రెండు రోజులు, మూడురోజులు... మగతా చెల్లించాల్సిన గడువు దగ్గిర కొచ్చేసింది!

సీతి ఎడ్లకి చిట్టుపెడుతోంది. కిష్టి కర్రనానుకుని, వేళ్ళతో తెల్లటిమాస్తాలు దువ్వుకుంటున్నాడు.

ఏం చెడ్డాలోచన కలిగిందో, ఆ ఎడ్లని ఓ నిమిషం నిమిరాడు ఖంగారుగా. కళ్లు నీళ్ళతో నిండాయి

చిట్టుపెడుతున్న సీతి, కిందో బొట్టుపడడంచూసి, ముఖంమీది జుట్టుని చేత్తో పైకితోసుకుంటూ జాలిగా అంది.

“ఏం నాన్నా!...”

“వీటిని... వీటి నమ్మాలి మనం బతకాలంటే” అతని గొంతుక ఆరిపోయింది. ఇంక మాట్లాడలేదు. గబగబావెళ్ళి స్తంభాన్ని ఆనుకుని అరుగుమీద కూచున్నాడు. చిట్టు చేత్తోనే వెళ్ళి పక్కని కూచుంది సీతి. ఎడ్లు తినడం మానేసి వీళ్ళని చూస్తున్నాయి...

“ఇవేనా ఎడ్లు?” కిర్రుజోళ్ళ కొవ్వుశరీరం అతికష్టం మీద మాట్లాడింది.

“అవునండి” అన్నాడు కిష్టి, తొరగా లేచి నించుని.

“అయితే సాయంత్రం పాలేరుని పంపుతాను. నేనన్నమాట కిచ్చెయ్యి”.

“కాదండీ, ఇంకో, పదిరూపాయలు...”

“వీల్లేదు”

“మరి, మీ ఇష్టం” కిష్టి అంతకన్న ఏమనలేదు. కొవ్వుశరీరం కదిలిపోయింది.

గడ్డివేయడం, వాటిని నిమరడం, చిట్టుపెట్టడం ఇవే రోజంతా కిష్టిపని. తిండన్నా తినలేదు. కళ్ళల్లో నీళ్లు ఆరిపోయి, ఎర్రబడ్డాయి. సీతీ అంతే; ఏమీ తినలేదు.

కార్మికులు, కర్షకుల చెమట బతుకుతో వాళ్ళకే విధమైన సహాయం చెయ్య నిరాకరించే ఈ స్వార్థపరుల సమాజం, ధర్మకర్తలు అతని కష్టాన్ని ఎన్నాళ్ళనించో పంచుకుంటున్న ఎడ్లతో బలవంతంగా విడాకులు ఇప్పించారు.

వాటిని పంపాక. కిష్టిపొందిన బాధకి అంతంలేదు. రాత్రి ఏదో ఆశతో వెళ్ళి, ఆ బ్రాహ్మల దొడ్డివైపు, వృథాగా, ఎంతోసేపు చూసి; అలిసిపోయి ఇంటికి తిరిగొచ్చాడు.

ఇట్లా నిద్రలో కలవరించడం సీతి వింది.

“నా ప్రాణాన్ని దొంగిలించారు. నేను బతకలేను” సీతి భయంతో, అతన్ని లేపుతోంది.